# మను అద్వితీయం

## ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు నెగ్గిన ప్లేయర్‌గా ఘనత

### 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో కాంస్యం

### సరబ్‌జ్యోత్‌తో కలిసి కంచు మోత మోగించిన భాకర్

**భారత ఒలింపిక్ చరిత్రలో సరికొత్త అధ్యాయం**

జూలై 30.. భారత ఒలింపిక్స్ చరిత్రలో సువర్ణాధ్యాయంగా లిఖించిదగ్గ రోజు ఇది. 124 ఏండ్ల సుదీర్ఘ ప్రయాణంలో మునుపెన్నడూ కనీవినీ ఎరుగని సరికొత్త అధ్యాయం 'పారిస్'లో ఆవిష్కృతమైంది. అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ అథ్లెట్ల పోటీని తట్టుకుని ఒక ఒలింపిక్స్‌లో ఒక్క పతకం తేవడానికే నానా తంటాలు పడుతున్న దశ నుంచి భారత్.. ఒకే ఎడిషన్‌లో, అదీ ఒకే క్రీడలో ఏకంగా రెండు పతకాలు కొల్లగొట్టింది. మూడు రోజుల క్రితమే పారిస్‌లో దేశానికి పతక బోణీ చేసిన యువ షూటర్ మను భాకర్.. మంగళ వారం జరిగిన పది మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ కాంస్య పతక పోరులోనూ కంచు మోత మోగించి సరికొత్త చరిత్ర సృష్టించింది. సహచర షూటర్ సరబ్‌జ్యోత్ సింగ్‌తో కలిసి దక్షిణ కొరియా ద్వయాన్ని ఓడించిన మను.. ఒకే ఎడిషన్‌లో రెండు పతకాలు సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా దిగ్గజ అథ్లెట్లకు సాధ్యం కాని అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. పతక పోరులో గురి తప్పని లక్ష్యంతో చెక్కుచెదరని ఏకాగ్రతతో స్ఫూర్తిదాయక ఆటతీరును ప్రదర్శించిన మను, సరబ్‌జ్యోత్.. దేశానికి రెండో పతకాన్ని అందించారు.

పారిస్: విశ్వక్రీడల్లో భారత్‌కు రెండో పతకం దక్కింది. పారిస్‌లో భారత్‌కు తొలి పతకాన్ని అందించిన 22 ఏండ్ల యువ షూటర్ మను భాకర్.. మంగళవారం జరిగిన 10 మీటర్ల ఎయిర్‌పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లోనూ సరబ్‌జ్యోత్ సింగ్‌తో కలిసి కాంస్యం నెగ్గి భారత ఒలింపిక్ చరిత్రలో మునుపెన్నడూ సాధ్యం కాని, దిగ్గజ అథ్లెట్లు సైతం అందుకోలేని ఘనతను సాధించింది. కాంస్య పోరులో భారత జోడీ 16-10తో దక్షిణ కొరియా ద్వయం లీ వొనొహొ, ఒ యె జిన్‌ను ఓడించి విశ్వక్రీడా యవనికపై మరోసారి మువ్వన్నెల పతకాన్ని రెపరెపలాడించింది. ఈ ఈవెంట్ క్వాలిఫికేషన్ రౌండ్‌లో భాగంగా త్రుటిలో రజత పోరు అర్హత కోల్పోయిన మను, సరబ్‌జ్యోత్.. కాంస్య రేసులో మాత్రం గురి తప్పలేదు. మొదటి షాట్ నుంచే ఆధిక్యంలో ఉన్న భారత్.. 13 షాట్లలో పతకాన్ని ఖాయం చేసుకుంది. ఇదే ఈవెంట్‌లో సెర్బియా స్వర్ణం సాధించగా టర్కీ రజతం గెలుచుకుంది.

### పతకం పట్టుకొచ్చారిలా..

కాంస్య పతక పోరులో మొదటగా 16 పాయింట్లు సాధించిన జట్టు విజేతగా నిలుస్తుంది. మొదటి షాట్‌తో మను 10.2 పాయింట్లు స్కోరు చేయగా సరబ్‌జ్యోత్ 8.6 మాత్రమే చేయడంతో భారత్ ఖాతాలో 18.8 పాయింట్లు వచ్చాయి. కొరియన్ ద్వయం 20.5 స్కోరు సాధించడంతో ఆ జట్టు ఖాతాలో 2 పాయింట్లు చేరాయి. కానీ రెండో షాట్ నుంచి భారత్ పుంజుకుంది. భారత షూటర్లిద్దరూ వరుసగా నాలుగు షాట్లు 20కి పైగా స్కోరు చేసి 8 పాయింట్లు కొల్లగొట్టారు. 7, 9, 10వ షాట్‌లలోనూ భారత్‌కు పాయింట్లు చేరాయి. అయితే 11, 12 వ షాట్‌కు కొరియా పుంజుకున్నా 13వ షాట్‌తో మరో 2 పాయింట్లు స్కోరు చేసిన భారత్..16 పాయింట్ల లక్ష్యాన్ని పూర్తిచేసి పతకం సాధించింది.

### రైతు కొడుకు

భాకర్‌తో కలిసి భారత్‌కు రెండో పతకాన్ని అందించిన సరబ్‌జ్యోత్ సింగ్ మధ్యతరగతి రైతు కొడుకు. హర్యానాలోని అంబాలా జిల్లా ధీనా గ్రామానికి చెందిన జతిందర్ సింగ్, హర్దీప్ కౌర్‌లకు 2001లో జన్మించాడు. జతిందర్ సాధారణ రైతు కాగా హర్దీప్ గృహిణి. చిన్నప్పుడు ఫుట్‌బాలర్ అవుదామనుకుని కలలుగన్న సరబ్‌జ్యోత్‌కు ఆ తర్వాత వయసుతో పాటు అభిరుచులూ మారిపోయాయి. 13 ఏండ్ల వయసులో తన ఇంటికి సమీపంలో కొంతమంది పిల్లలు సమ్మర్ క్యాంప్‌లో ఎయిర్ పిస్టల్స్‌తో సాధన చేయడం చూసిన అతడు ఈ క్రీడపై మక్కువ పెంచుకున్నాడు. 2014లో తన తండ్రి దగ్గరకు వెళ్లి.. 'నాన్న నేను షూటింగ్ నేర్చుకుంటా' అనగానే అది తమ తాహతుకు మించిన వ్యవహారమని సంకోచించిన ఆ తల్లిదండ్రులు.. కుమారుడి ఆసక్తిని చూసి కాదనలేకపోయారు. చండీగఢ్‌లోని డీఏవీ కాలేజీలో అభిషేక్ రాణా మార్గనిర్దేశనంలో మెలకువలు నేర్చుకున్న సరబ్‌జ్యోత్ జిల్లా, రాష్ట్ర స్థాయిలలో పతకాల పంట పండించాడు. 2019లో జూనియర్ వరల్డ్ చాంపియన్, 2022 ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన భారత జట్టులో సభ్యుడిగా ఉన్న అతడు.. 2023 ఏషియన్ చాంపియన్‌షిప్స్‌లో కాంస్యం నెగ్గాడు.

### తొలి క్రీడాకారిణి

124 ఏండ్ల భారత ఒలింపిక్ చరిత్రలో ఇంతవరకూ ఒక్కరంటే ఒక్క అథ్లెట్ కూడా ఒకే ఎడిషన్‌లో రెండు పతకాలు నెగ్గలేదు. ఈ ఘనత సాధించిన తొలి అథ్లెట్‌గా మను నిలిచింది. గతంలో సుశీల్ కుమార్ (రెజ్లర్), పీవీ సింధు (బ్యాడ్మింటన్) రెండు పతకాలు సాధించినా ఇవి వేర్వేరు ఎడిషన్లలో వచ్చినవి.

### పతకాల పట్టిక

| | దే | స్వ | ర | కా | మొ |
|---|---|---|---|---|---|
| 1 | జపాన్ | 7 | 2 | 4 | 13 |
| 2 | చైనా | 6 | 6 | 2 | 14 |
| 3 | ఫ్రాన్స్ | 5 | 8 | 4 | 17 |
| 4 | ఆస్ట్రేలియా | 5 | 4 | 0 | 9 |
| 5 | కొరియా | 5 | 3 | 3 | 11 |
| 6 | యూఎస్ఏ | 4 | 8 | 10 | 22 |
| 32 | భారత్ | 0 | 0 | 2 | 2 |

దే : దేశం, స్వ: స్వర్ణం, ర: రజతం, కా: కాంస్యం మొ: మొత్తం

### 'ఆరే'సిన షూటర్లు

మను, సరబ్‌జ్యోత్ పతకంతో షూటింగ్‌లో భారత్ పతకాల సంఖ్య మొత్తంగా 6కు చేరింది. ఇందులో అభినవ్ బింద్రా స్వర్ణం (2008), రాజ్యవర్ధన్‌సింగ్ రాథోడ్ (2004), విజయ్ కుమార్ (2012) రజతాలు.. గగన్ నారంగ్, మను భాకర్ (రెండు కాంస్యాలు), సరబ్‌జ్యోత్ సింగ్ కాంస్య పతకాలున్నాయి. తద్వారా భారత క్రీడా చరిత్రలో హాకీ (12) తర్వాత అత్యధిక పతకాలు సాధించిన క్రీడగా షూటింగ్ నిలిచింది.

### ప్రిచర్డ్ మనోడేనా?

1900లో బ్రిటీష్-ఇండియన్ నార్మన్ ప్రిచర్డ్ అథ్లెటిక్స్‌లో రెండు పతకాలు (200 మీటర్ల స్ప్రింట్, 200 మీటర్ల హర్డిల్స్) నెగ్గినా అతడు భారతీయుడా? ఆంగ్లేయుడా? అన్న విషయంలో వివాదం సుదీర్ఘకాలంగా సాగుతోంది. కోల్‌కతాలో పుట్టి పెరిగిన ప్రిచర్డ్‌ను అంతర్జాతీయ ఒలింపిక్ అసోసియేషన్ భారతీయుడిగానే గుర్తిస్తున్నా వరల్డ్ అథ్లెటిక్స్ (పూర్వపు ఐఎఎఎఫ్) మాత్రం అతడి పతకాలను బ్రిటన్‌కు చూపెడుతోంది. ప్రిచర్డ్ భారత్‌లో పుట్టి పెరిగినా అతడు ఆంగ్లేయుడే అని.. ఒలింపిక్స్‌లో పాల్గొనడాని కంటే ముందే అతడు లండన్ ఏఏఏ (అమెచ్యూర్ అథ్లెటిక్స్ అసోసియేషన్) తరపున ప్రాతినిధ్యం వహించారని బ్రిటన్‌కు చెందిన ఒలింపిక్స్ చరిత్రకారుడు ఇయాన్ బుకానన్ పేర్కొన్నాడు. ఏఏఏ ప్రదర్శన ఆధారంగానే అతడు ఒలింపిక్స్‌కు అర్హత సాధించాడనే వాదనలున్నాయి.

**1** షూటింగ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు ఇదే తొలి పతకం.

**6** షూటింగ్‌లో ఇప్పటిదాకా భారత్ సాధించిన పతకాల సంఖ్య.

## నాకౌట్ దిశగా..

### హాకీలో భారత్ ఘన విజయం

హాకీలో భారత జట్టు రెండో విజయాన్ని నమోదుచేసింది. పూల్-బీ లో భారత్ 2-0తో ఐర్లాండ్‌ను చిత్తు చేసి నాకౌట్ దశకు మరింత చేరువైంది. న్యూజిలాండ్‌తో నెగ్గినా అర్జెంటీనాతో కష్టపడిన మెన్ ఇన్ బ్లూ.. ఐర్లాండ్‌తో మాత్రం అదరగొట్టారు. మ్యాచ్‌లో బంతిని ఎక్కువభాగం ప్రత్యర్థి ఆధీనంలోనే ఉంచి పదే పదే వారి గోల్‌పోస్ట్ పైకి దాడికి దిగారు. భారత స్టార్ ప్లేయర్ హర్మన్‌ప్రీత్ 13, 19వ నిమిషాల్లో వరుస గోల్స్ చేశాడు. ఐర్లాండ్‌కు పదే పదే పెనాల్టీ కార్నర్ అవకాశాలు వచ్చినా గోల్ కీపర్ పీఆర్ శ్రీజేష్ వాటిని విజయవంతంగా అడ్డుకున్నాడు. గ్రూప్ దశలో మరో రెండు మ్యాచ్‌లు ఆడనున్న భారత్.. ఒక్కటి గెలిచినా నాకౌట్ బెర్తును ఖాయం చేసుకుంటుంది.

## లక్ష్యం వైపు వడివడిగా

**ప్రిక్వార్టర్స్‌కు మనికా, శ్రీజ**

**సాత్విక్ జోడీ దూకుడు**

**ఆర్చరీలో మిశ్రమ ఫలితాలు**

పారిస్: భారీ ఆశలతో పారిస్‌కు వెళ్లిన భారత బృందం పతకాల రేసులో వడివడిగా ముందుకు సాగుతోంది. నాలుగో రోజు భారత్‌కు రెండో పతకం దక్కడంతో పాటు పలు క్రీడాంశాలలో మన అథ్లెట్లు విజయాలతో తదుపరి రౌండ్‌కు ముందంజ వేశారు. టేబుల్ టెన్నిస్‌లో మనికా బాత్ర, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లగా క్వార్టర్స్ బెర్తును ఖాయం చేసుకున్న బ్యాడ్మింటన్ పురుషుల ద్వయం సాత్విక్-చిరాగ్ గ్రూప్ దశలో చివరి మ్యాచ్‌ను తమ దూకుడుతో ఏకపక్షంగా మార్చేశారు. హాకీలో ఐర్లాండ్‌పై నెగ్గిన 'మెన్ ఇన్ బ్లూ' నాకౌట్ బెర్తును దాదాపుగా ఖాయం చేసుకుంది. ఆర్చరీలో భారత్‌కు మిశ్రమ ఫలితాలు దక్కాయి.

### మనిక, శ్రీజ సరికొత్త చరిత్ర

టేబుల్ టెన్నిస్‌లో భారత్‌కు పతకం మీద ఆశలు రేపుతున్న ప్యాడ్లర్లలో మనికా బాత్రతో పాటు హైదరాబాదీ అమ్మాయి శ్రీజ ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లారు. రౌండ్ ఆఫ్ 32లో మనికా 4-0 (11-9, 11-6, 11-9, 11-4)తో ఆతిథ్య ఫ్రాన్స్‌కు చెందిన ప్రితిక పవడెను ఓడించింది. భారత్ తరపున ఒలింపిక్స్‌లో ప్రిక్వార్టర్స్ చేరిన తొలి ప్యాడ్లర్‌గా రికార్డు లకెక్కింది. మనికాతో పాటు హైదరాబాదీ శ్రీజ.. 4-0 తో కలబెర్గ్ ను ఓడించి రౌండ్ ఆఫ్ 16కు అర్హత సాధించింది.

### సాత్విక్ జోడీ ధనాధన్

ఇప్పటికే క్వార్టర్స్ బెర్తును ఖాయం చేసుకున్న భారత స్టార్ షట్లర్ జోడీ సాత్విక్-చిరాగ్.. గ్రూప్ దశలో తమ చివరి మ్యాచ్‌ను ఏకపక్షంగా ముగించారు. గ్రూప్ సీ పురుషుల డబుల్స్ మూడో మ్యాచ్‌లో భారత ద్వయం.. 21-13, 21-13తో మహ్మద్ రియాన్-ఫజర్ అల్ఫియన్ (ఇండోనేషియా)పై సంపూర్ణ ఆధిపత్యం చెలాయించి 38 నిమిషాల్లోనే మ్యాచ్‌ను పూర్తిచేశారు. మరోవైపు మహిళల డబుల్స్‌లో భారత జోడీ అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో 15-21, 10-21తో మపస-అంగెల (ఆస్ట్రేలియా) చేతిలో చిత్తైంది. మూడో మ్యాచ్‌లో ఓడి నిష్క్రమించింది.

### భజన్ కౌర్ రాణించినా..

ఆర్చరీలో యువ భారత ఆర్చర్ భజన్ కౌర్ ప్రిక్వార్టర్స్‌కు చేరింది. మహిళల వ్యక్తిగత రౌండ్ ఆఫ్ 16 ఎలిమినేషన్ పోరులో కౌర్.. 6-0తో పోలండ్‌కు చెందిన మిస్టోర్‌ను ఓడించింది. వరుసగా మూడు సెట్లలో కౌర్ 28, 29, 28 స్కోరు చేయగా మిస్టోర్ 23, 26, 22 వద్దే ఆగిపోయింది.

### బాక్సింగ్‌లో

భారత బాక్సర్ అమిత్ పంగల్ ఆడిన తొలి మ్యాచ్‌లోనే ఇంటిబాట పట్టాడు. పురుషుల 51 కిలోల ప్రిక్వార్టర్స్‌లో పంగల్ 1-4తో చిన్‌యెంబ(జాంబియా)కు తలవంచాడు. మహిళల బాక్సింగ్‌లో జాస్మిన్ లంబోరియా 0-5తో పెటికో చేతిలో ఓటమిపాలైంది.

### బాల్‌రాజ్‌కు త్రుటిలో..

ఒలింపిక్స్ రోయింగ్ పోటీలలో బరిలోకి దిగిన ఏకైక రోయర్ బాల్‌రాజ్ పన్వర్ పోరాటం క్వార్టర్స్‌లోనే ముగిసింది. పురుషుల సింగిల్స్ స్కల్స్ క్వార్టర్స్ రేసులో అతడు లక్ష్యాన్ని 7 నిమిషాల 5.10 సెకన్లలో పూర్తి చేసి ఐదో స్థానంతో ముగించాడు. పురుషుల ఆర్చరీ వ్యక్తిగత విభాగం రౌండ్ ఆఫ్-16లో యువ ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్ 5-6తో పీటర్స్(కెనడా) చేతిలో ఓటమిపాలయ్యాడు.

## కడుపులో ఏడు నెలల చిన్నారితో

**ఒలింపిక్స్‌లో ఈజిప్టు మహిళ పోరాటగాథ**

పారిస్: ఒక మహిళ జీవితంలో గర్భాధారణ అత్యంత కీలకం. ప్రెగ్నెన్సీ నిర్ధారణ అయ్యాక ఎక్కువ మంది స్త్రీలు బెడ్‌రెస్ట్‌కే పరిమితమవుతారు. కానీ ఈజిప్టుకు చెందిన ఫెన్సర్ నదా హఫెజ్ మాత్రం ఏడు నెలల గర్భిణీగా ఉన్నా ఒలింపిక్స్‌లో బరిలోకి దిగింది. ఫెన్సింగ్ అంటేనే ప్రమాదకర క్రీడ అయినప్పటికీ ఆమె కడుపులో ఏడు నెలల చిన్నారితో పోటీలలో పాల్గొంది. ఈ విషయాన్ని స్వయంగా ఆమె ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ద్వారా వెల్లడించింది. 'మీకు వేదికపై కనిపిస్తోంది ఇద్దరు మాత్రమే. అందులో ఒకరు నేను మరొకరు నా ప్రత్యర్థి. కానీ అక్కడున్నది ముగ్గురు. నా కడుపులో ఏడు నెలల చిన్నారి ఉంది. ఈ ప్రయాణంలో నేను, నా బేబీ భౌతికంగానే గాక మానసికంగానూ సవాళ్లను ఎదుర్కొంటున్నాం. కానీ జీవితం, క్రీడల సమతుల్యతను కాపాడుకోవాలంటే తప్పకుండా పోరాడాల్సిందే. ఈ ప్రయాణంలో నాకు అండగా నిలిచిన నా భర్త, కుటుంబస భ్యులకు ధన్యవాదాలు. గతంలో రెండు సార్లు బరిలోకి దిగినా పారిస్ ఒలింపిక్స్ నాకు, నా కడుపులో పెరుగుతున్న లిటిల్ ఒలింపియన్‌కు ఎంతో ప్రత్యేకం' అని రాసుకొచ్చింది. హఫెజ్ తన తొలి మ్యాచ్‌లో అమెరికాకు చెందిన ప్రపంచ పదో ర్యాంకర్ ఎలిజిబెత్‌ను ఓడించి రౌండ్ ఆఫ్ 16కు అర్హత సాధించింది. కానీ ఈ రౌండ్‌లో జియోన్ హయాంగ్ (దక్షిణ కొరియా)చేతిలో ఓడింది.

## 'అల' గాలిలో తేలుతూ..

ఒలింపిక్స్‌లో తొలిసారి నిర్వహిస్తున్న సర్ఫింగ్ పోటీలలో భాగంగా బ్రెజిల్‌కు చెందిన గాబ్రియేల్ మదీనా విన్యాసమిది. పారిస్‌కు సుమారు 15 వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న తహిటి దీవులలో జరుగుతున్న ఈ పోటీల మూడో రోజు ఆటలో గాబ్రియెల్.. 9.90 స్కోర్ చేసి ఒలింపిక్ చరిత్రలోనే అత్యధిక స్కోరు నమోదు చేసిన సర్ఫర్‌గా రికార్డులకెక్కాడు. ఈ ఫొటోపై నెటిజన్లు స్పందిస్తూ.. 'పిక్చర్ ఆఫ్ ది ఒలింపిక్స్' అని కామెంట్ చేస్తున్నారు.

## భారత్ 'సూపర్'

**ఆఖరి టీ20లో ఉత్కంఠ విజయం**

**లంకపై 3-0తో సిరీస్ క్లీన్‌స్వీప్**

పల్లెకెలె : శ్రీలంక పర్యటనలో వరుసగా రెండు మ్యాచ్‌లు గెలిచి ఇది వరకే సిరీస్ కైవసం చేసుకున్న యువ భారత జట్టు ఆఖరి టీ20లో బ్యాటింగ్ విభాగంలో తడబడ్డా బౌలర్లు రాణించడంతో సూపర్ ఓవర్‌లో అద్భుత విజయం సాధించింది. ఇరుజట్ల స్కోర్లు సమం కావడంతో 'సూపర్ ఓవర్'కు దారి తీసిన ఈ మ్యాచ్‌లో టీమ్‌ఇండియానే విజయం వరించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన భారత్ టాపార్డర్, మిడిలార్డర్ వైఫల్యంతో నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 137 పరుగులే చేయగలిగింది. 48 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన భారత్‌ను వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (39), లోయరార్డర్‌లో రియాన్ పరాగ్ (26) ఆరో వికెట్‌కు 54 పరుగులు జోడించి ఆదుకున్నారు. ఆఖర్లో వాషింగ్టన్ సుందర్ (25) రాణించడంతో టీమ్‌ఇండియా గౌరవప్రదమైన స్కోరు సాధించింది. అనంతరం స్వల్ప ఛేదనలో లంకేయులు సైతం తడబడ్డారు. 20 ఓవర్లు ఆడిన ఆ జట్టూ 137/8 వద్దే ఆగిపోయింది. ఓపెనర్లు పతుమ్ నిస్సంక (26), కుశాల్ మెండిస్ (43) తొలి వికెట్‌కు 58 పరుగులు జోడించి ఆ జట్టుకు శుభారంభం అందించారు. నిస్సంక ఔట్ అయినా కుశాల్ పెరీరా (46) ఆ జట్టును గెలిపించేందుకు యత్నించాడు. కానీ చివరి 5 ఓవర్లలో లంక 29 పరుగులు మాత్రమే రాబట్టి 7 వికెట్లు నష్టపోయింది. చివరి ఓవర్లో 6 పరుగులు కావాల్సి ఉండగా సూర్య 5 పరుగులే ఇచ్చి 2 వికెట్లు పడగొట్టడంతో మ్యాచ్ టై అయింది. ఇక సూపర్ ఓవర్‌లో సుందర్..కుశాల్ పెరెరా(0), నిస్సంక(0)ను వరుస బంతుల్లో ఔట్ చేయడంతో లంక రెండు పరుగులకే ఆలౌటైంది. తీక్షణ వేసిన తొలి బంతినే సూర్యకుమార్ ఫోర్ కొట్టి జట్టుకు అద్భుత విజయాన్ని అందించాడు. సుందర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.